నమస్తే తెలంగాణ
వికారాబాద్
15 | హైదరాబాద్, శుక్రవారం 22 మార్చి 2024 | VIKARABAD

తనిఖీలు ముమ్మరం..

వికారాబాద్ జిల్లాలో పోలీసుల విస్తృత తనిఖీలు

24 గంటలపాటు అప్రమత్తం

సరిహద్దుల్లో ఏడు అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల ఏర్పాటు.. నిఘా పెంపు

కర్ణాటక నుంచి మద్యం, డబ్బు తరలకుండా గట్టి బందోబస్తు

ఐదు రోజుల్లో జిల్లాలో రూ.3.51 లక్షల నగదు స్వాధీనం

వికారాబాద్, మార్చి 21 (నమస్తే తెలంగాణ): ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో జిల్లా అంతటా తనిఖీలు ముమ్మరమయ్యాయి. జిల్లాను ఆనుకొని ఉన్న కర్ణాటక రాష్ట్ర సరిహద్దుల వద్ద పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశా రు. ఓటర్లను ప్రలోభపెట్టేందుకు డబ్బు, మద్యం భారీగా తరలించే అవకాశాలు న్న దృష్ట్యా జిల్లా ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకు పోలీస్ యంత్రాంగం చెక్‌పోస్టుల వద్ద 24 గంటలపాటు బందోబస్తును ఏర్పాటు చేసింది. చెక్‌పోస్టుల ఏర్పాటుతోపాటు వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ నియోజకవర్గాల్లోని మున్సిపాలిటీలు, మండలాల్లోని ప్రధాన కూడళ్ల వద్ద విస్తృతంగా వాహ నాల తనిఖీలు చేపడుతున్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తున్న వారిపై నేరుగా ప్రజలు ఫిర్యాదు చేసేందుకు వీలుగా సీ-విజిల్ యాప్, 1950 టోల్‌ఫ్రీ నంబర్‌ను ఎన్నికల సంఘం అందుబాటులోకి తెచ్చింది. అదేవిధంగా ఆరు ఫ్లయింగ్ స్క్వాడ్, 6 ఎస్ఎస్‌టీ బృందాలు 24 గంటలపాటు పర్యవేక్షిస్తున్నాయి.

రూ. 3.51 లక్షల నగదు స్వాధీనం..

జిల్లాలో తనిఖీలు ముమ్మరమయ్యాయి. ఎన్నికల అధికారులు నియమించిన ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలతోపాటు పోలీసులు నిత్యం తనిఖీలు చేస్తున్నారు. నాలుగు నియోజకవర్గాల్లోని ప్రధాన కూడళ్లు, అంతర్రాష్ట్ర సరిహద్దుల వద్ద అనుమానం ఉన్న ప్రతి వాహనాన్నీ తనిఖీ చేస్తున్నారు. ఈనెల 16న పార్లమెంట్ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను విడుదల చేయగా, ఆ రోజు నుంచే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. కోడ్ అమల్లోకి రావడంతో అంతర్రాష్ట్ర సరిహద్దుల వద్ద ప్రత్యేకంగా చెక్‌పోస్టులను అందుబాటులోకి తెచ్చారు. ఎన్నికల నిబంధనల ప్రకారం రూ. 50 వేలకు మించి నగదును తరలిస్తే ఆ డబ్బుకు సంబంధించి సరైన ఆధారాలు, ధ్రువీకరణ పత్రాలను అధికారులకు చూపించాల్సి ఉంటుంది. లేకుంటే ఆ నగదును జిల్లా ఎన్నికల అధికారులకు అప్పగి స్తారు. అదేవిధంగా రూ.10 లక్షలకు మించి నగదు పట్టుబడితే ఆ మొత్తాన్ని ఐటీ శాఖకు అప్పగిస్తారు. అయితే ఐదు రోజుల్లో జిల్లాలో నిర్వహించిన తనిఖీ ల్లో రూ.3.51లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బంట్వారం పోలీస్‌స్టేషన్ పరిధిలో రూ.లక్ష, మోమిన్‌పేట పీస్ పరిధిలో రూ.2 లక్షలు, కులకచర్ల పీఎస్ పరిధిలో రూ.51,200.. అదేవిధంగా జిల్లావ్యాప్తంగా 128 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు 15 కేసులు నమోదు చేశారు. జిల్లాలో 240 లైసెన్స్‌డ్ గన్లు ఉండగా, ఇప్పటికే 218 మంది డిపాజిట్ చేశారు.

సరిహద్దుల్లో ఏడు అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులు..

జిల్లా పరిధిలో ఏడు అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. పోలీసు, రెవెన్యూ అధికారులతో వాటిలో బందోబస్తు నిర్వహిస్తున్నారు. అవసరాన్ని బట్టి మరిన్ని అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులను అధికారులు ఏర్పాటు చేయనున్నారు. కర్ణాటక రాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన దౌల్తాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చంద్రకల్ వద్ద.. కొడంగల్ పీఎస్ పరిధిలో కస్తూరుపల్లి వద్ద.. బషీరాబాద్ పీస్ పరిధిలో మైల్వార్, ఇందర్‌చెడ్, నవాంగి వద్ద.. కరన్‌కోట్ పీఎస్ పరిధిలో కొత్లాపూర్ వద్ద, బంట్వారం పోలీస్ స్టేషన్ పరిధిలో బొపనారం వద్ద అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు.

విస్తృతంగా తనిఖీలు..

- కోటిరెడ్డి, వికారాబాద్ ఎస్పీ

ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన దృష్ట్యా జిల్లా అంతటా గట్టి నిఘా పెంచడంతోపాటు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నాం. అంతే కాకుండా జిల్లాకు అనుకొని ఉన్న కర్ణాటక రాష్ట్ర సరిహద్దు వద్ద ఏడు అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి 24 గంటలపాటు తనిఖీలు నిర్వహిస్తున్నాం. అదేవిధంగా జిల్లాలోని నాలుగు సెగ్మెంట్లలోని ప్రధాన కూడళ్ల వద్ద కూడా నిత్యం తనిఖీలను ముమ్మరం చేశాం. కోడ్ అమల్లో ఉన్నందున రూ.50 వేలకు మించి ఎవరైనా నగదును తరలిస్తే దానికి సంబంధించిన ఆధారాలు, ధ్రువ పత్రాలను చూపించాలి. లేకుంటే ఆ నగదును పోలీసులు స్వాధీనం చేసుకుంటారు.

కల్యాణ వైభవం..



కడ్తాల్ మండల పరిధిలోని రావిచేడ్ గ్రామంలో కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారి కల్యాణాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు.

అనుమానాస్పద లావాదేవీలను గుర్తించాలి

రంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంక

రంగారెడ్డి, మార్చి 21(నమస్తే తెలంగాణ) : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో బ్యాంకర్లు అనుమానాస్పద లావాదేవీలను గుర్తించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంక సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఆయన జిల్లా స్థాయి బ్యాంకర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 6వ తేదీ వరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందన్నారు. ఎవరైనా లక్ష రూపాయలకుపైగా డబ్బుల లావాదేవీలు జరిపితే కచ్చితంగా వివరాలు తెలియజేయాలన్నారు. జిల్లాలో ఏటీఎంలలో డబ్బులు నింపేందుకు వచ్చే సెక్యూరిటీ వ్యాన్‌లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ఏజెన్సీలు పెద్ద మొత్తంలో డబ్బులు తరలించాలంటే తెలంగాణ సీఈవో నుంచి అనుమతి పొందాలన్నారు. లాకర్లలోని గోల్డ్‌ను పర్యవేక్షించాలని, క్యాష్ జనరేట్ చేసేందుకు క్యూఆర్‌కోడ్‌ను ఉపయోగించాలన్నారు. వాహనాల నంబర్లను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని ..అలాగే ప్రతిరోజూ క్యాష్ డిపాజిట్ వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికల ఖర్చుల వివరాల కోసం కొత్త బ్యాంకు ఖాతాను తెరవాలన్నారు. ఎన్నికల్లో విధులు నిర్వహించేందుకు బ్యాంకుల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది వివరాలను ఎపిక్ కార్డులతో కూడిన పూర్తి సమాచారం అందజేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, డీఈవో సంగీత, ఎల్డీఎం కుసుమ, వివిధ బ్యాంకుల ప్రతినిధులు, ఎలక్షన్ సూపరింటెండెంట్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

నిర్ణేతలు మనోళ్లే

- గెలుపోటములపై తీవ్ర ప్రభావాన్ని చూపనున్న రంగారెడ్డి ఓటర్లు
- ఐదు ఎంపీ స్థానాలతో జిల్లాకు బంధం
- ప్రస్తుతం జిల్లాలో 35,85,426 మంది ఓటర్లు
- కొన్ని చోట్ల పాత ప్రత్యర్థుల మధ్యే పోటీ!

రంగారెడ్డి, మార్చి 21 (నమస్తే తెలంగాణ): ఐదు ఎంపీ స్థానాలతో ఉన్న అనుబంధం కారణంగా సార్వత్రిక ఎన్నికల్లో రంగారెడ్డి జిల్లా కీలక భూమిక పోషించనున్నది. జిల్లాలో 8 అసెంబ్లీ నియోజకవర్గాలుండగా..అవి చేవెళ్ల, భువనగిరి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో ఉన్నాయి. జిల్లాలో 35,85,426 ఓటర్లుండగా..మే 13న జరుగనున్న లోక్‌సభ ఎన్నికల్లో అభ్యర్థుల విజయావకాశాలపై రంగారెడ్డి జిల్లా ఓటర్లు తీవ్ర ప్రభావాన్ని చూపనున్నారు. అలాగే..కొన్ని చోట్ల మారిన రాజకీయ సమీకరణాల నేపథ్యంలో పాత ప్రత్యర్థులే ప్రస్తుత ఎన్నికల్లోనూ తలపడనుండడంతో ఈసారి ఫలితాలపై సర్వత్రా ఆసక్తి నెలకొన్నది.

జిల్లాలో ఐదుగురు ఎంపీల ప్రాతినిధ్యం..

పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో రంగారెడ్డి జిల్లాలో రాజకీయ వాతావరణం వేడెక్కుతున్నది. జిల్లా ఐదు పార్లమెంట్ స్థానాల పరిధిలో విస్తరించి ఉండగా.. ఇక్కడి ఎనిమిది అసెంబ్లీ సెగ్మెంట్లు వేర్వేరు ఎంపీ స్థానాల పరిధిలో ఉన్నాయి. చేవెళ్ల ఎంపీ స్థానం పరిధిలో మహేశ్వరం, చేవెళ్ల, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్ అసెంబ్లీ సెగ్మెంట్లు ఉన్నాయి. భువనగిరి ఎంపీ పరిధిలో ఇబ్రహీంపట్నం అసెంబ్లీ, మహబూబ్‌నగర్ ఎంపీ పరిధిలో షాద్‌నగర్ అసెంబ్లీ, నాగర్‌కర్నూల్ ఎంపీ పరిధిలో కల్వకుర్తి(ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల మండలాలు) అసెంబ్లీ, మల్కాజిగిరి ఎంపీ పరిధిలో ఎల్బీనగర్ నియోజకవర్గం ఉన్నది. ఆయా నియోజకవర్గాల్లో పార్టీల బలాబలాలు, మారిన రాజకీయ పరిణామాలు తాజా..లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపించనున్నాయి.

పార్టీల వ్యూహ, ప్రతి వ్యూహాలు..

జిల్లాలో లోక్‌సభ ఎన్నికల సందడి మొదలైంది. బలమైన అభ్యర్థులను రంగంలోకి దించి అత్యధిక ఎంపీ స్థానాలను కైవసం చేసుకునేందుకు అన్ని పార్టీలు వ్యూహ, ప్రతి వ్యూహాలకు పదునుపెడుతున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికలతో పోల్చితే సార్వత్రిక ఎన్నికల నాటికి పార్టీల బలాబలాలు మారిపోతున్నాయి. రోజురోజుకూ రాజకీయ పరిణామాలు వేగంగా మారుతుండడంతో అన్ని పార్టీలు ఆచి తూచి అడుగులు వేస్తున్నాయి. అభ్యర్థుల ఎంపిక విషయంలో ఒకటికి రెండుసార్లు ఆలోచించి నిర్ణయం తీసుకుంటున్నాయి.

బీఆర్ఎస్ పార్టీ చేవెళ్ల లోక్‌సభ అభ్యర్థిగా కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను, మహబూబ్‌నగర్ స్థానానికి సిట్టింగ్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మల్కాజిగిరికి రాగిడి లక్ష్మారెడ్డి పేరును అధిష్ఠానం ఖరారు చేసింది. భువనగిరి, నాగర్‌కర్నూల్ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించాల్సి ఉన్నది. అదేవిధంగా భారతీయ జనతా పార్టీ చేవెళ్ల అభ్యర్థిగా కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని, మహబూబ్‌నగర్‌కు డీకే అరుణను, భువనగిరికి బూర నర్సయ్యగౌడ్‌ను, నాగర్‌కర్నూల్‌కు సిట్టింగ్ ఎంపీ రాములు తనయుడు భరత్‌ప్రసాద్‌ను, మల్కాజిగిరికి ఈటల రాజేందర్ పేరును ప్రకటించింది. అభ్యర్థులను ప్రకటించే విషయంలో కాంగ్రెస్ పార్టీ వెనుకబడి ఉన్నది. చేవెళ్లకు అభ్యర్థిని ప్రకటించే విషయంలో ఇంకా ఆ పార్టీలో సందిగ్ధత నెలకొన్నది. ఇటీవల బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డిని అభ్యర్థిగా ఖరారు చేసే యోజనలో ఉన్నట్లు తెలుస్తున్నది. చేవెళ్ల టికెట్‌ను ఆశించిన పట్నం సునీతామహేందర్‌రెడ్డికి మల్కాజిగిరి టికెట్ ఖాయం చేసినట్లు ప్రచారం జరుగుతున్నది. మహబూబ్‌నగర్ స్థానానికి వంశీచంద్‌రెడ్డి పేరును ప్రకటించగా..నాగర్‌కర్నూల్, భువనగిరి అభ్యర్థులను ఖరారు చేయాల్సి ఉన్నది.

నియోజకవర్గాలవారీగా ఓటర్లు ఇలా..

నియోజకవర్గం	పార్లమెంటు స్థానం	ఓటర్లు
ఇబ్రహీంపట్నం	భువనగిరి	3,37,547
ఎల్బీనగర్	మల్కాజిగిరి	5,99,423
మహేశ్వరం	చేవెళ్ల	5,52,620
రాజేంద్రనగర్	చేవెళ్ల	6,01,412
శేరిలింగంపల్లి	చేవెళ్ల	7,45,796
చేవెళ్ల	చేవెళ్ల	2,68,034
కల్వకుర్తి	నాగర్‌కర్నూల్	2,43,306
షాద్‌నగర్	మహబూబ్ నగర్	2,37,288

మళ్లీ వాళ్లే ప్రత్యర్థులు..

ఎన్నికలు సమీపిస్తున్న వేళ..నేతలు పార్టీలు మారడం జోరందుకున్నది. నేతల పార్టీల మార్పుతో కొత్త సమీకరణాలు ఏర్పడుతున్నాయి. పార్టీ కండువాలు మార్చుకున్నప్పటికీ అక్కడక్కడా పాత ప్రత్యర్థులే ఈ ఎన్నికల్లోనూ తలపడే పరిస్థితులు నెలకొన్నాయి. 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి రంజిత్‌రెడ్డి, కాంగ్రెస్ నుంచి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బీజేపీ నుంచి జనార్దన్‌రెడ్డి తలపడగా రంజిత్‌రెడ్డి గెలుపొందారు.

కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోవడంతో..

అయితే ఇటీవల రంజిత్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరడంతో చేవెళ్ల అభ్యర్థిగా ఆయన్నే ఆ పార్టీ ప్రకటించే అవకాశం ఉన్నది. గతంలో కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన విశ్వేశ్వర్‌రెడ్డి ఈసారి ఎన్నికల్లో బీజేపీ నుంచి బరిలో ఉన్నారు. బీఆర్ఎస్ పార్టీ కాసాని జ్ఞానేశ్వర్‌ను ఎంపీ అభ్యర్థిగా ప్రకటించింది. దీంతో రంజిత్‌రెడ్డి, విశ్వేశ్వర్‌రెడ్డిలు తాజా ఎన్నికల్లో వేర్వేరు పార్టీల నుంచి ప్రత్యర్థులుగా తలపడనున్నారు. అలాగే మహబూబ్‌నగర్ స్థానం నుంచి 2019 ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి మన్నె శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ నుంచి వంశీచంద్‌రెడ్డి, బీజేపీ నుంచి డీకే అరుణ పోటీ చేయగా..బీఆర్ఎస్ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి గెలుపొందారు. ఈసారి కూడా లోక్‌సభ ఎన్నికల్లో పాత అభ్యర్థులు.. ఆ పార్టీల నుంచే పోటీలో ఉన్నారు.

చెక్‌పవర్ వచ్చింది..

పాఠశాలల్లో ఎస్ఎంసీ చైర్మన్ల స్థానంలో టీచర్‌కు చెక్‌పవర్

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

బిల్లుల చెల్లింపునకు వెసులుబాటు

బొంరాస్‌పేట, మార్చి 21 : ప్రభుత్వ పాఠశాలల్లో నిధుల వినియోగానికి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. గత ఏడాది డిసెంబర్ నెలలో పాఠశాల యాజమాన్య కమిటీ(ఎస్ఎంసీ)లను ప్రభుత్వం రద్దు చేసింది. అంతకుముందు ఎస్ఎంసీ చైర్మన్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడి జాయింట్ చెక్‌పవర్‌తో నిధులు డ్రా చేసేవారు. కానీ కమిటీల రద్దు తర్వాత కొత్త ఎస్ఎంసీలకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో చెక్ పవర్ సమస్య ఏర్పడింది. దీంతో మూడు నెలలుగా పాఠశాల నిర్వహణ నిధులు వినియోగించలేని పరిస్థితి నెలకొన్నది. ఈ సమస్యను నివారించేందుకు ప్రభుత్వం ఎస్ఎంసీ చైర్మన్ల స్థానంలో హెచ్ఎంతోపాటు పాఠశాలలోని మరో టీచర్‌కు జాయింట్ చెక్‌పవర్ కల్పించింది. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో ఎస్ఎంసీ ఖాతాల్లోని నిధులను వినియోగించుకోవడానికి అవకాశం కలిగింది.

1068 పాఠశాలలు..

వికారాబాద్ జిల్లాలో 776 ప్రాథమిక, 176 ఉన్నత, 116 ప్రాథమికోన్నత కలిపి మొత్తం 1068 పాఠశాలలు ఉన్నాయి. వీటి నిర్వహణకు ప్రభుత్వం ఏటా వివిధ గ్రాంట్ల కింద రూ.10 వేల నుంచి రూ.50 వేల వరకు నిధులను విడుదల చేస్తున్నది. ఈ నిధులను ఏడాదిలో రెండు విడుతల్లో పాఠశాలల ఎస్ఎంసీల ఖాతాల్లో జమ చేస్తున్నది. స్టేషనరీ, జాతీయ పండుగల నిర్వహణ, చిన్న చిన్న మరమ్మతులు, ఇంటర్నెట్ చార్జీలు, కంప్యూటర్లు, ల్యాబ్‌ల నిర్వహణ, విద్యుత్ బిల్లులు, తాగునీరు తదితరాల కోసం వినియోగిస్తుంటారు. ఎస్ఎంసీ కమిటీలు రద్దు కావడం, వాటి స్థానంలో కొత్త వాటిని ఎన్నుకోకపోవడంతో నిధులు వినియోగించలేని పరిస్థితి నెలకొన్నది. వివిధ గ్రాంట్ల కింద విడుదలైన నిధులు ఎస్ఎంసీల ఖాతాల్లోనే ఉండిపోయాయి. దీనివల్ల పాఠశాలల నిర్వహణ కష్టంగా ఉందని ఉపాధ్యాయులు వాపోతున్న తరుణంలో ప్రభుత్వం చెక్‌పవర్‌లో మార్పులు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. పాఠశాల హెచ్ఎంతో పాటు సీనియర్ ఉపాధ్యాయుడికి జాయింట్ చెక్‌పవర్ కల్పించింది. ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉన్నచోట స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంకు జత చేస్తూ చెక్‌పవర్ కల్పించారు. కొత్త ఎస్ఎంసీలు ఏర్పాటయ్యే వరకు ఈ ఉత్తర్వులు అమలులో ఉంటాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. చెక్‌పవర్‌లో మార్పులు చేస్తూ ఉత్తర్వులు వెలువడడంతో హెచ్ఎంలు బ్యాంకుల్లో తదనుగుణంగా మార్పులు చేసుకుంటున్నారు.

బిల్లుల చెల్లింపునకు అవకాశం..

గతేడాది ప్రారంభించిన మన ఊరు-మన బడి, మనబస్తీ-మనబడి కార్యక్రమాల కింద చేపట్టిన పనులన్నీ పాఠశాల విద్యా కమిటీల పర్యవేక్షణలోనే కొనసాగాయి. కమిటీలను రద్దు చేయడంతో చెక్‌పవర్‌కు వెసులుబాటు లేక నిధులు డ్రా చేయలేక పనులు చేసిన వారికి బిల్లులు చెల్లింపులు నిలిచిపోయాయి. ప్రభుత్వ నిర్ణయంతో ఈ సమస్యకు పరిష్కారం లభించినట్లయింది. విద్యా సంవత్సరం ముగింపు దశకు వచ్చిన నేపథ్యంలో ఈ నెలాఖరులోగా పెండింగ్ బిల్లులు లేకుండా చూడాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొన్నది.

ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం..

ఎస్ఎంసీ కమిటీలను రద్దు చేసిన తర్వాత చైర్మన్ స్థానంలో ఎవరికీ చెక్‌పవర్ ఇవ్వకపోవడంతో ఖాతాల్లోని నిధులను వినియోగించలేని పరిస్థితి నెలకొన్నది. ప్రభుత్వం చైర్మన్ స్థానంలో సీనియర్ టీచర్‌కు జాయింట్ చెక్‌పవర్ కల్పించడం హర్షణీయం. దీంతో పాఠశాలల నిర్వహణకు నిధులను వినియోగించుకునే అవకాశం కలిగింది.

-రవీందర్‌గౌడ్, హెచ్ఎం, పూర్యానాయక్‌తండా

టిమ్స్ పనుల్లో వేగం పెంచాలి

వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సెక్రటరీ క్రిస్టినా చోంగ్తు

రంగారెడ్డి, మార్చి 21 (నమస్తే తెలంగాణ) : కొత్తపేటలో నిర్మిస్తున్న టిమ్స్ హాస్పిటల్ పనుల్లో వేగం పెంచి త్వరితగతిన పూర్తి చేయాలని వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సెక్రటరీ క్రిస్టినా చోంగ్తు సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో కలెక్టర్ శశాంకతో కలిసి ఆమె నిర్వహించిన సమావేశంలో కొత్తపేటలో నిర్మిస్తున్న టిమ్స్, మహేశ్వరంలోని మెడికల్ కాలేజీ పనులపై చర్చించారు. మెడికల్ కాలేజీకి సంబంధించిన ప్రతిపాదనలు, అవసరమైన మౌలిక సదుపాయాల గురించి సంబంధిత అధికారులతో ఆరా తీశారు. కచ్చితమైన ప్రణాళికలు రూపొందించి ప్రతిపాదనలు పంపాలని వైద్యారోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. అనంతరం నిర్మాణంలో ఉన్న కొత్తపేట టిమ్స్ హాస్పిటల్ పనులను ఆమె వైద్యారోగ్య జాయింట్ సెక్రటరీ సత్యనారాయణ, కలెక్టర్ శశాంకతో కలిసి పరిశీలించారు. టిమ్స్ హాస్పిటల్ నిర్మాణ పనులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎల్ అండ్‌టీ ఇంజినీర్లు వివరించారు. నిర్మాణంలో ఉన్న భవన నిర్మాణ పనులను పరిశీలించారు. హాస్పిటల్ నిర్మాణ పనుల పురోగతిపై ఆరా తీశారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను సెక్రటరీ ఆదేశించారు. ఈ పర్యటనలో డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అధికారిణి డాక్టర్ వాణి, గచ్చిబౌలి టిమ్స్ హాస్పిటల్ డైరెక్టర్ విమలాథామస్, వనస్థలిపురం ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ హరిప్రియ, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు, ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి, తహసీల్దార్లు జానకి, విజయలక్ష్మి, ఆర్‌అండ్‌బీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

టిమ్స్ పనులను పరిశీలిస్తున్న వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సెక్రటరీ క్రిస్టినా చొంగ్తు, కలెక్టర్ శశాంక

గ్రేటర్‌లో సొరంగ మార్గాలు

ఐదు చోట్ల నిర్మాణానికి ఈవోఐ పిలిచిన జీహెచ్ఎంసీ

సిటీబ్యూరో, మార్చి 21 (నమస్తే తెలంగాణ) : జీహెచ్ఎంసీ పరిధిలోని ఐదు మార్గాల్లో సొరంగ మార్గాల నిర్మాణాలకు సంబంధించిన ఫీజిబిలిటీ స్టడీ, సమగ్ర ప్రాజెక్టు రూపకల్పన (డిటెల్డ్ ప్రాజెక్టు రిపోర్టు) తయారీకి కేవలం ఒకే ఒక సంస్థ ఆసక్తిని చూపింది. గతంలో కేబీఆర్ పార్కు కింద నుంచి సొరంగ మార్గానికి ఫీజిబిలిటీ స్టడీ, డీపీఆర్ తయారీ పనులు పొందిన ఆర్వీ అసోసియేట్స్, అర్కిటెక్ట్ ఇంజినీర్స్ అసోసియేషన్ ముందుకు రాగా.. తాజా టెండర్‌లో ఆర్వీ మాత్రమే ముందుకు వచ్చింది. కాగా గత నెల ఐదు మార్గాల్లో ఈవోఐ టెండర్ పిలిచిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగానే వచ్చిన ఆర్వీ దరఖాస్తును అధికారులు పరిశీలిస్తున్నారు. ఐతే ఆర్వీ సంస్థకు డీపీఆర్ తయారీ బాధ్యతలు అప్పగిస్తారా? లేదంటే మరోసారి టెండర్ పిలుస్తారా ? అన్నది వేచి చూడాల్సిందే.

ప్రతిపాదించిన మార్గాలివే..

1. ఐటీసీ కోహినూర్ నుంచి విప్రో సర్కిల్ వరకు వయా ఖాజాగూడ, నానక్‌రాంగూడ - 9 కి.మీ
2. ఐటీసీ కోహినూర్ నుంచి జేఎన్‌టీయూ వరకు వయా మైండ్ స్పేస్ జంక్షన్ - 8.కి.మీ
3. ఐటీసీ కోహినూర్ నుంచి బంజారాహిల్స్ రోడ్ నంబర్ 10 వయా జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 45 - 7.కి.మీ
4. జీవీకే మాల్ నుంచి నానల్‌నగర్ వయా మాసబ్‌ట్యాంక్ - 6.కి.మీ.
5. నాంపల్లి నుంచి చాంద్రాయణ ఇన్నర్ రింగు రోడ్డు గుట్ట వయా చార్మినార్, ఫలక్‌నుమా - 9.కి.మీ